بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 26.07.2019 (Telugu)**

**ఆతిథ్యము అల్లాహ్ తఆలాకు సైతం చాలా ఇష్టమే. ఎంత ఇష్టమనగా హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో దీనిని రెండు సార్లు ప్రస్తావించాడు**

**ఈ విషయములో ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మనకు గొప్ప ఆదర్శంగా వున్నారు, అల్లాహ్ తఆలాను, ప్రళయ దినమును విశ్వసించే వారికి మూడు విషయములను ఆదేశించారు, వాటిలో మూడవ విషయము తమ అతిథి మర్యాదలని వారు సూచించారు**

**ఒక అందమైన, శాంతియుత సమాజ నిర్మాణము కొరకు ఇది గీటురాయి, అల్లాహ్ తఆలా ఆదేశములలో ఒక ఆదేశమిది, విశ్వాసుని గుర్తింపు ఇది**

*హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 02.08.2019 తేదీన - హదీఖతుల్ మహ్దీ, ఆల్టన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. నేడు మరోసారి జల్స సాలానా ఇంగ్లాండ్‌లో పాల్గొను అవకాశము అల్లాహ్ తఆలా మనకు కల్పించుచున్నాడు. గత మాసములో జర్మనీ, కెనడా, అమెరికా జల్స నిర్వహించబడెను. ప్రపంచములోని ఇంకా అనేక దేశాలలో జల్సాలు జరిగెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో అల్లాహ్ తఆలా సహాయ సహాకారాల వాగ్దానములు ఎంతో గొప్పగా పూర్తి అగుచున్నట్లు ప్రతి చోట మనము తిలకించాము. కాని ఇంగ్లాండ్ జల్సకు ఒక ప్రత్యేకత యున్నందున ప్రపంచవాసులు మన వారైనను ఇతరులైనను దీనిని ప్రత్యేక దృష్టితో చూస్తారు. ఇది ఖిలాఫత్ కేంద్రమైనందున అన్ని విధాలా దీనికి అంతర్జాతీయ స్థాయి ఆపాదించడం జరుగుతుంది. కనుక ప్రపంచములోని వివిధ దేశాల ప్రజలు జమాఅత్ సభ్యులతో పాటు ఇతరులు కూడ ఇంగ్లాండ్ జల్సలో పాల్గొనుటకు ప్రయత్నింతురు. కావున ఇక్కడి జల్స సేవకుల బాధ్యత కూడ చాలా పెరిగిపోవును. ఇక్కడ హదీఖతుల్ మహ్దీలో కూడ ఒక తాత్కాలిక నగరము ఏర్పాటు చేయబడెను. ఈ ఏర్పాట్లు కూడ విశిష్ట దృష్టిని ఆశించును. కనుక సేవకులకు వారి వారి విధులు, బాధ్యతల గురించి కొన్ని విషయములు సూచిస్తాను. ఇప్పుడు నేను ఈ విషయములనే మొదట తెలుపదలచితిని.

ఇంగ్లాండ్‌లో నివసించుచున్న అహ్మదీ వృద్ధులు, పిల్లలు, స్త్రీలు, బాలికలు ఖిలాఫత్ కేంద్రము ఇక్కడికి మారి, వర్తమాన ఖలీఫా పర్యవేక్షణలో జల్సాలు నిర్వహించబడుచు, జల్సాల ఏర్పాట్లు జరుగున్నప్పటి నుండి అనగా గత 35 సం॥ల నుండి ఎంతో సంతోషముతో అల్లాహ్ తఆలా కృపానుసారము విధులు నిర్వహించుచున్నారు. నేడు మనము చూచినచో ఇక్కడి సేవకులు బహుశా రబ్వా సేవకులకు కూడ ఏర్పాట్లలో సహాయము చేయు ప్రతిభ కలిగివున్నారు. నాలుగైదు వేల సభ్యులకు భోజన ఏర్పాట్లు చేయుట ఒక పెద్ద సవాలుగా మారేది. 90 శాతం రొట్టెలు దుకాణము నుండి కొనుగోలు చేసేవారు. ఇప్పుడు అల్లాహ్ తఆలా కృపానుసారము 35, 40 వేల సభ్యులకు రొట్టెలు స్వంతంగా చేయుచున్నారు. నేను కూడ అప్పుడప్పుడు పరిశీలించాను. ప్రజలు కూడ ఇష్టపడుచున్నారు. నాకు కూడ ఈ రొట్టె ఇష్టమే. గతములో చేసే రొట్టెల కంటే ఇదెంతో రుచికరమైనది. ఈ పని చేయుచున్న యువకులకు వారి వృత్తిలో అల్లాహ్ తఆలా మరింత నైపుణ్యము ప్రసాదించుగాక! వారికి తెలివి తేటలు కలిగించుగాక! ప్రగతి కల్పించుగాక! జల్స అతిథులకు గతము కంటే మెరుగ్గా సేవలందించుదురు గాక!

ఇంకా వంటశాలలో భోజనము వండే సేవకులు తమ తమ ఇంచార్జులతో కలిసి చాలా శ్రద్ధ, శ్రమతో తమ పనిలో నిమగ్నమై వున్నారు. వంటశాలలో దేగులను కడిగే శాఖ ఒకటున్నది. ఇది కూడ చాలా పెద్ద శ్రమతో కూడుకున్న విభాగము. ఖాదియాన్‌లో కూలీలకు డబ్బులిచ్చి ఈ పని చేయించుకుంటారు. కాని ఇక్కడ ఎంతో స్ఫూర్తి, ఉత్సాహముతో సేవకులు ఈ పని చేస్తారు. ఇంకా భోజనము వడ్డించే విభాగమున్నది. ఈ సారి వీరు దీనిని

మరింత మెరుగుపచరినారు. ప్రశాంతంగా కొద్ది సమయములోనే అతిథులకు భోజనము వడ్డించుటకు వీలుండాలని పెద్ద పెద్ద మార్కీలు వేసినారు.

ఇంకా ఇతర విభాగములు పరిశుభ్రత, పార్కింగ్, ట్రాఫిక్ వంటివి వున్నవి. సభా ప్రాంగణము లోపల కూడ వివిధ శాఖలున్నవి. సెక్యూరిటి విభాగాము కూడ చాలా ముఖ్యమైనది. ఇదే విధంగా ఇంకా కొన్ని ఇతరత్రా శాఖలున్నవి. తమ పరిధిలో ప్రతి విభాగము చాలా ముఖ్యమైనదే. ఈ విభాగములన్నిటిలో సేవలందించు అనుగ్రహము సభ్యులకు కలుగుచున్నది. ఇదే విధంగా సేవకురాళ్లకు కూడ సేలందించు అనుగ్రహము లభించుచున్నది. చాలా చక్కగా తమ తమ విధులు నిర్వహించుటకు అల్లాహ్ తఆలా సేవకులందరిని అనుగ్రహించుగాక! మీరు ఏ స్ఫూర్తిలో తమను తాము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతిథులకు సేవలందించుటకు సమర్పించినారో ఆ స్ఫూర్తిని చివరి వరకు కొనసాగించాలని నేను ప్రతి సారి చెప్పినట్లు ఈ సారి కూడ సేవకులకు తెలుపుచున్నాను. మీరు కొనసాగించారని మీ ముఖములపై కనిపించే చిరునవ్వు, అతిథులతో మీరు అతి మర్యాదగా వ్యవహరించే తీరు తెలుపును. జల్సాలో పాల్గొంటున్న అతిథులకు సేవలందించుచున్న సేవకులు ఈ జల్సాలో రెండింతల పుణ్యము పొందుచున్నారని, శుభములను అందుకొంటున్నారని సదా గుర్తుంచుకోవలెను. ఆతిథ్యము అల్లాహ్ తఆలాకు సైతం చాలా ఇష్టమే. ఎంత ఇష్టమనగా హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో దీనిని రెండు సార్లు ప్రస్తావించాడు. అతిథులకు భోజనము వడ్డించుట ఒక సామాన్య విషయమైనచో అతిథులు వచ్చిన ప్రతిసారి వారికి భోజనము అందిచుటను ప్రస్తావించకపోవును.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ఆదర్శము మన ముందున్నది. అల్లాహ్ తఆలా, ప్రళయ దినమును విశ్వసించువారికి ఆదేశించిన మూడు విషయములు, పరస్పరం హక్కుల గురించి గలవు, అవి సమాజమును శాంతియుతంగా మార్చునటువంటివి. మొదటి విషయమేమనగా మంచి మాటలు మాట్లాడుము లేదా మౌనము పాటించుము. అనవసర మాటలు మాట్లాడి అశాంతిని కలిగించకుము. పరస్పరం కలహాలను సృష్టించకుము. ఈ విషయములో జాగ్రత్త వహించుము. రెండవ విషయమేమనగా తమ పొరుగు వారిని గౌరవించుము. ఎందుకనగా పొరుగువారికి కూడ హక్కు యుండును. కనుక అతని గౌరవమును కూడ గుర్తుంచుకోవలెను. అతిథుల మర్యాద మూడవ విషయము. ఈ విషయము ఆతిథ్యమిచ్చువారికి ప్రత్యేకమైనది. ఒక అందమైన శాంతియుత సమాజ నిర్మాణమునకు ఇది గీటురాయి. అల్లాహ్ తఆలా ఆదేశములలోని ఇదొకటి. ఇది విశ్వాసి గుర్తింపు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఎక్కువ సంఖ్యలో అతిథులు వచ్చినప్పుడు అనుచరులలో వారిని పంచేవారు. మీ సోదరులు మీకు మంచి అతిథి మర్యాదలు చేసినారా ? అని అతిథులను అడిగి తెలుసుకునే వారు కూడ. అనుచరులు కూడ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా శిక్షణ, సంస్కరణ పొందినవారైనందున వారు మంచిగా అతిథి మార్యాదలు చేసేవారు. కనుక మాకు తమ కంటే ఉత్తమ సౌకర్యములు అందించి, తమ కంటే మంచి భోజనము వడ్డించారని అతిథులు కూడ సమాధానమిచ్చేవారు. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల అతిథిమార్యద పద్ధతులు ఇట్లుండేవి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ అతిథులకు అతిథిమర్యాదలు చేయుటకే మనము విధించబడినాము. అల్లాహ్ తఆలా తన దయానుసారము జమాఅత్ వసతులలో గతములో కంటే చాలా విశాలమైన వసుతులు కల్పించెను. జమాఅత్ వ్యవస్థ ద్వారనే అతిథి మార్యదలు చేయబడును. కాని అనుచరుల పరిస్థితి ఇలా లేకుండెను. అప్పుడు ఒక కేంద్ర వ్యవస్థ లేకుండెను. వారి వ్యక్తిగత స్థితులు కూడ మంచిగా లేకుండెను. పిల్లలను ఆకలితో పరుండబెట్టి, తాము కూడ ఆకలితో యుండి వున్న కొద్ది ఆహారము అతిథికి అందించినటువంటి సంఘటనలు లభించును. వారి ఈ మర్యాదల వలన అల్లాహ్ తఆలా కూడ ఆనందించి ప్రోత్సహించుచు ఈ ప్రత్యేక సంఘటన గురించి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు సమాచామందించెను. త్యాగములు చేసి అతిథి మర్యాదలు చేసినవారిని ఆదర్శంగా తీసుకోవాలని మనకు ఆదేశము గలదు. నేడు అల్లాహ్ తఆలా కృపానుసారము త్యాగస్ఫూర్తితో అతిథి మర్యాదలు చేసేవారు చాలా మంది జమాఅత్‌లో వున్నారు. ఇలాగే మనము చేయవలెను. సేవలందించుచున్న సేవకులు వంద శాతం త్యాగస్ఫూర్తితో సత్ప్రవర్తనలతో అతిథి మర్యాదలు అందించవలెను. అతిథుల మర్యాదలు, అతిథుల సేవల

గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గొప్ప సఘటనలు చాలా మనకు లభించును.

సుదూర ప్రాంతము నుండి వచ్చినటువంటి అతిథులు లంగర్ ఖానా (సత్రము)లోని సేవకుల నిరాకరణ వలన అసంతృప్తితో తిరిగి వెళ్లినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు ఈ విషయము తెలియగా బూట్లు తొడుగుటకు ఇబ్బంది పడ్డ పరిస్థితి వున్నను వారు త్వరగా వారి వెనుక వెళ్లిరి. వారు టాంగాలో వెళ్లుచుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వచ్చుచున్నట్లు వారు చూచి టాంగాను నిలిపి టాంగా నుండి దిగిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వారితో క్షమాపణ కోరి తిరిగి రావాలని తెలిపిరి. ఇలా వారి టాంగాను తిరిగి రప్పించిరి. నేను మీతో పాటు నడుచుకుంటూ వస్తాను, మీరు టాంగాలో కూర్చోగలరని వారు వారితో అనిరి. అతిథులు కూడ పశ్చత్తాపానికి గురై టాంగాలో కూర్చొనక స్వయంగా వారు కూడ నడుచుకుంటూ వచ్చిరి. సత్రమునకు చేరుకున్నప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం స్వయంగా వారి సామాగ్రి దించడం మొదలు పెట్టిరి. అప్పటికే పశ్చత్తాపమునకు గురైన సేవకులు తక్షణమే ముందుకు వచ్చి అతిథుల సామాగ్రి దించిరి. అతిథులకు తగిన విధంగా నివాసము, ఆహార ఏర్పాట్లు జరగనంత వరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అక్కడే వుండిరి. అనంతరం సేవకులతో ఇట్లనిరి. చూడండి. చాలా మంది అతిథులు వస్తారు. కొందరు మీకు పరిచయముంటారు, మరికొందరు మీకు తెలియనివారుంటారు. కనుక అందరిని గౌరవనీయులుగా భావించి సేవలందిచుట ఉత్తమము. మీరు అతిథులకు మంచి మర్యాదలు చేస్తారని నేను మీ గురించి మంచిగా ఆలోచిస్తాను. ఈ మంచి అశయమును మనము కూడ కొనసాగించవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేను కొన్ని విషయములు అతిథులకు కూడ చెప్పదలచితిని. ఒకరు మరొకరి అనగా అతిథుల, సేవకుల మనోభావాలను గౌరవించుట చాలా ముఖ్యమైన విషయము. అతిథులకు సపర్యలు చేయాలని ఇస్లాం ఆదేశించినట్లు సేవకులపై అధిక భారము మోపకూడదని కూడ ఆదేశించెను. ఒకరి వద్ద ఎక్కువ రోజులు అతిథులుగా యుండుట, సేవకులపై భారమగుట మీరు దాన ధర్మములు తీసుకున్నట్లగునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. ఆరంభము నుండి అంతము వరకు ఒకే విధంగా సపర్యలు చేయు స్థోమతి ప్రతి ఒక్కరికి వుండదు. కావున మీరు ఇంటివారికి ఇబ్బంది కలిగించకూడదని అతిథులకు కూడ ఆదేశము గలదు. జల్సకు వచ్చిన అతిథులు ఒక నెల వరకున్నను మీరు సేవలందించాలని నేను జల్స సేవకులకు సూచించు చున్నాను. మూడు లేదా నాలుగు రోజుల తర్వాత మనము అతిథి మర్యాదలు ఎత్తివేయాలని భావించకూడదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తమ పనుల వలన లంగర్ ఖానా (సత్రము)ను కూడ ఒక విభాగమని పేర్కొనిరి. కనుక హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం లంగర్ ఖానాకు వచ్చినటువంటి వారితో గొప్పగా వ్యవహరించవలెను.

సత్సమాజ నిర్మాణము గురించి సలాం ఆచారమును పాటించాలని మరో ఆదేశము గలదు. ఈ జల్స పరిసరాలలో దీనిని అతిథులు ప్రత్యేకంగా ఆచరించవలెను. స్వర్గములో ప్రవేశించువారి ఒక ప్రత్యేకత సలాం ఆచారమును పాటించుట అని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిరి. ఇంకా వారిట్లనిరి. మీకు తెలిసిన వారైనను తెలియని వారైనను సలాం చేయండి. ప్రజలు గుమి కూడడంతో పరస్పరం ప్రేమానుగారాలు, పరిచయము పెరుగునని జల్స ఉద్దేశములలో ఒకటని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కూడ సూచించిరి. తద్వారా పరస్పరం కోపాలు కూడ దూరమైపోవును. అనంతరం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. ఈ జల్సలో పాల్గొని ప్రాపంచిక కోరిక తగ్గి, తమ పోషకుడైన అల్లాహ్, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ప్రేమ అధికము కావాలని ప్రయత్నించవలెను. ఈ ప్రేమను పొందుటకు జల్స కార్యాక్రమాలలో శ్రద్ధతో పాల్గొనండి, జాగ్రత్తగా వినండి. జల్స జరుగుచుండగా, అనంతరం అటు ఇటు తిరుగుచున్నప్పుడు కూడ అల్లాహ్‌ను స్మరించండి. అతి శ్రద్ధ, కలతతో నమాజ్ బాజామఅత్ సలుపండి. అదనపు నమాజులు, తహజ్జుద్ కూడ ప్రత్యేకంగా సలుపుటకు శ్రద్ధ చూపండి. ఇక్కడే విడిది చేసిన వారు ప్రత్యేకంగా ఈ ప్రాంతమును పవిత్రము చేయుటకు ప్రయత్నించండి. తమ పరిస్థితులను మెరుగుపరచుకొనుటకు కృషి చేయండి.

ఏర్పాట్ల గురించి నేను అతిథులకు చెప్పదలచిన మరో విషయమేమనగా తాత్కాలిక, విశాల ఏర్పాట్లలో

కొన్ని లోపాలు వుండవచ్చును. కనుక వాటిని విస్మరించండి. లోపాలు కనిపించినచో అతిథులు విస్మరించుచు లోపాలను చక్కదిద్దుటకు సేవకులకు సహకరించవలెను. కొందరు అతిథులు స్వయంగా సేవకులుగా మారి పని చేయుచున్నట్లే నేను చూచినాను. ఇటువంటి స్ఫూర్తియే ఒక అహ్మదీలో వుండవలెను. ఈ నిజమైన స్ఫూర్తియే పరస్పరం సతస్సమాజ నిర్మాణమునకు ఉపయోగపడును. సేవకులను పరీక్షించుటలో అతిథులు తమ సమయమును వృథా చేయకూడదు. అవసరమున్నచో ప్రతి విభాగములో సహకరించండి. ఇదే విధంగా పార్కింగ్ వద్ద కూడ కొన్ని సార్లు రష్ అయినందున ఆందోళనకరమైన స్థితి ఏర్పడును. ఇటువంటి సందర్భములలో కార్లలో వచ్చేవారు సహనము, ఓర్పుతో నిర్వహకులకు సహకరించవలెను. ఇంకా ప్రవేశ ద్వారముల వద్ద స్కానింగ్ ఏర్పాట్లు వున్న చోట కూడ సంపూర్ణ సహనమును ప్రదర్శించవలెను.

జల్సలో కూర్చున్న వారు కూడ తమ కుడి ఎడమ పర్యవేక్షించవలెను. అటు ఇటు తిరుగుచున్నప్పుడు కూడ తమ చుట్టు జాగ్రత్తగా వుండవలెను. సెక్యూరిటి పరంగా నిర్వహకులు ఆదేశించిన ప్రతి విషయమును పాటించండి. అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమనగా జల్సకు వచ్చిన ఉద్దేశమును పూర్తి చేయుటకు, ప్రతి దుష్టుని దుష్టత్వము నుండి రక్షణ లభించుటకు ఎల్లప్పుడు దుఆ చేయండి. పాకిస్తాన్‌లో వున్నటువంటి అహ్మదీయుల పరిస్థితుల కొరకు కూడ దుఆ చేయండి. అల్లాహ్ తఆలా వారికి కూడ శాంతియుత జీవితము ప్రసాదించుగాక! ప్రతి ఇబ్బంది నుండి అల్లాహ్ తఆలా వారిని రక్షించుగాక! వ్యతిరేకుల క్రొత్త, పాత ప్రణాళికలను విఫలము చేయుగాక!

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇంకా ఎమ్.టి.ఏ. తరపున ఒక ప్రకటన కూడ గలదు. వారిచే స్మార్ట్ టి.వి. యాప్ నేడు ప్రారంభించబడును. ఇప్పుడు ఏ దేశములోనైనా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఎల్.జి., ఫ్లిప్స్, అమజాన్ ఫైర్ టి.వి., సోనీ, అండ్రాయిడ్ టి.వి.సెట్స్ ద్వారా డిష్ ఆంటీనా లేకుండానే ఎమ్.టి.ఏ. అన్ని చానళ్లను తిలకించవచ్చును. బయట వుండేవారు దీని నుండి లబ్ది పొందవచ్చును. ఇప్పుడు జుమా తర్వాత నేను దీనిని లాంచ్ చేయుదును. అల్లాహ్ తఆలా జల్సను అన్ని విధాలా విజయవంతము చేయుగాక! మీరందరు దీని నుండి పూర్తిగా లబ్ది పొందుదురు గాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..................................................................

..................................................................

..................................................................